# ఏటి? నాను ఎర్రోణ్ణా?

ఎంకడేటో ఎఱ్ఱోడనుకుంతరందరు. నానాడి మాటలన్నీ అబద్ధాలనుకుంతరు. నాను ఎఱ్ఱోణ్ణా ! నన్ను చూసినవ్వే ఎదవలు ఎఱ్ఱోళ్ళుగాని. నానెందుకు అబద్ధాలాడతాను? నానేం మినిస్టరునా, ఉద్యోగత్తుణ్ణా ! అబద్ధాలాడతానికి. నాకేటి గావాల అబద్ధాలాడీదాకా.

డాకటేరు అబద్దవాడినాడు. నా కొడుక్కి ఇంజక్సనే ఇవ్వనేదు పొమ్మన్నడు కాని నానా అబద్దనాడినాను! నాను డాక్టేరును పిలవడం అబద్ధవా? ఆడు.... ఆ నంజాకొడుకు తాగి నా కొడుక్కి ఇసవింజక్సను ఇవ్వడం అబద్దవా. నా కొనుకు హే.... హే.... హే.... ఇలా ఏడిత్తె అందరు నన్ను ఎఱ్ఱోడంతరు. కాని ఏణ్ణూ! డాక్టెరుసదివి కొడుకుని సి. ఆర్. పి. ఓళ్ళు కొట్టి సగం సంపితె, డాక్టేరు ఇసవింజక్సనిచ్చి పూర్తిగ సంపేసుండు. ఆణ్ణి.... ఆణ్ణి పాడిసెయ్యాల. ఆడి రగతం కళ్ళ సూడాల.

ఛీ. నాను నిజంగ ఎఱ్ఱోణ్ణే. ఎన్ని తూరులనుకున్నను డాక్టెరుని పాడిసెయ్యాలని? ఎప్పుడన్నా ఏడినన్నా పాడిశానా?

అయ్యోళ, నచ్చివి పెసవవయిన నాడు, నారాయణ గోడు పుట్టినరోజు. నచ్చివికి మూర్చలొచ్చి కొట్టుకుంతుంటె డాక్టేరు కాళ్ళట్టుకు పడవనేదూ! నా లచ్చివిని రచ్చించండి బాబో! అని.

అప్పుడా డాక్టేరు ఏటన్నడు! ఎదవ. గవర్నమెంటు డాక్టేరు ఇంటికొచ్చి వైధ్ధం సెయ్యడన్నడు. ఆడికెంత తల బిరుసు? నాకు గొంతుమొయ్యా కోపమొచ్చిందాడీమీద. ఎందుకంతిరు! ఆడు పెసిడెంటింటి కెళతడు. నాయుడింటి కెళతడు. బుగతగారింటి కెళతడు. అళ్ళంత డబ్బుగలోళ్ళని, ఈడికేవన్నా నంచ పెడతరనీ ఎళతాడు.

నాను పేదోణ్ణానీ, మాలాణ్ణానీ, రానసేసినాడు. గాని ఎదవ రూల్సు కోసవా? నా లచ్చివికా వాతం రాకుండుంతె, ఆ మూర్చలు రాకుండుంతె అలాటి నీతీ జాతీలేని ఎదవకాడికి నాను ఎల్లేబణ్ణా!

నచ్చివి, నా పెల్లాం. కాల్లూ చేతులూ తన్నుకు గిజగిజనాడిపోతూంటె ఈ యెదవ డాక్టేర్లెందుకా అనుకున్నాను. నచ్చివికి తలకొరివెడుతూ, డాక్టేరుని పొడి సెయ్యాలనుకున్నాను నిక్కచ్చిగా. అలా డాక్టేరుని పొడిసి ఆడి రగతం కళ్ళ సూడకపోతే నా పేరు ఎంకడే కాదని శబదం సేసుకున్నను.

కాని పొడిసేనా! ఎదవని ఎత్తెదవని ఆ కేతిరి కోడి కత్తి మొల్లోఎట్టుకు డాక్టేరింటి కెళ్ళి డాక్టేర్ని పొడిసెయ్యాలనుకున్నాను. నిదర్లోఉన్న ఆడు, ఆడిపెల్లవు, పిల్లలూ,

దొాండపాడు నాగున్న ఆళ్ళనుసూసి ఏటో సేతులొాచ్చినయి గావు డాక్టేరుని పొడవతానికి. సేతులఉన్న కత్తిమొల్లా ఎట్టేసుకున్నా. ఏటా ఎదవజలములుపోతాయి. అందరవూ ఓ రోజు సచ్చే ఓళ్ళవె, బతికిన నాలుగు రోజుల్లో ఎందుకలాటి ఎదవపనులు సెయ్యాలా? అనుకుంట ఇంటికి తిరిగొాచ్చేసి నారాయణగోడి పక్కలో తొంగుని నచ్చవికోసం ఏడిసినాను. అప్పుడే ఆడి పేరు నారాయణాన్నాను, నా నచ్చవికి మోాచ్చం రావాలని అప్పుడే అనుకున్నాను. నారాయణగోణ్ణి పెంచి పెద్దోణ్ణి ఆణ్ణి డాక్టేరు సదివించి, నాలాటి పేదోళ్ళ పేనాలు కాపాడ్డానికి ఈ ఊళ్ళో ఆడిచేత బోర్డు కట్టిద్దారనుకున్నాను.

హె.... హె.... హె.... ఏటయ్యాడు నారాయణ? ఆడి కోసం, ఆడి సదువుకోసం ఐదెకరాల పొలవు, మావిడితోటా తలదాసుకునే గూడూ అమ్మేసినాను. ఆడు సరదావడి గుడ్డ ముక్కలకోసం కూలిడబ్బులు కూడేసీటోణ్ణి. ఆడు డాక్టరై నాకు కూడెడతడనుకున్నను. ఏటా, దేవుడు నాలాటోళ్ళ బతుకుల్తో ఆడుకుంతడు. ఇప్పుడు కూలి కెల్లాలంటే సత్తువ నేదు. ఎఱ్ఱటి ఏగాణిదాసుకోనేదు. అడుక్కుంటె నాకో ముద్ద ఒడెయ్యరు కానీ, నాచేత వాగించి నవ్వుతరు.

నాను ఓగుతున్నానా? నానెందుకు ఓగుతాను? ఇది ఓగుడా? డాక్టెరుని పొడిసెయ్యాలనుకోడం నిజవే కదూ!

నచ్చవి సచ్చిపోయిన్నాడు గవర్నమెంటు డాక్టెరే. కాని నారాయణగోడి కింజకన్న నిచ్చినోడు పెయివేటు డాక్టెరు.

ఈడికయిను రూపాయలిత్తె ఏడికన్న ఒత్తడు. ఈడికన్నా ఆడెనయవేవో; ఒచ్చి ఇసవింజక్సనిచ్చి మడిసిని సంపేసేకన్నా రాకుండుంతె మంచిది కదూ!

ఈడు రాకుండుంటె నారాయణగోడు బతికేఓడేమొ. నారాయణగోడెలాగన్నా డాక్టెరు సదువులో ఏసినకాణ్ణుంచి నా మాటినడం మానేసినాడు. దేశాన్ని సూసేఓళ్ళు పెద్ద పెద్దోళున్నరు అయినా నీలాటి సదువుకునీ ఓడికెందుకురా సమ్మెలన్నాను.

ఆడు నామాటిని ఇంట్లోఉంటె కతే లేదు. ఆడూ నన్ను ఎఱ్ఱోణ్ణి సూసినట్టే సూసేఓడు, నాకేటి తెలియదనీఓడు. ఏటేటో సెప్పేఓడు. ఆడి మాటలేటో నాకు తెలిసేయి గావు. అదేటి సదువులో! కాలేజి సదువులో ఎల్లినకాణ్ణించి ఆడిమాట, ఏసం అన్నీ మారిపోనాయి, ఇంగ్లీసే మాట్లాడేఓడు. నా కొడుకేటి దొరనా మాట్లాడతన్నాడని ఎంత పొంగిపోయీ ఓణ్ణి!

గాంధీగోరున్నప్పుడు ఏమో సమ్మెలు, సత్యాగ్రహాలూ, అనీ ఓరు. కాని నాను పుట్టిబుద్ధెరిగి ఇలాటి సమ్మె సూడలేదు, నారాయణగోడు ఈదిలోకెళ్ళినకాణ్ణుంచి నాకు బయవె, ఆడేవయిపోతాడో ఎవరు సంపెతరో అని. కాళ్ళూ సేతులూ ఆడాయికాదు, మళ్ళీ ఆడింటికి సేరీదాకా.

ఎఱ్ఱిటోపీలోళ్ళు, గిన్నెటోపీలోళ్ళు సదువుకునీ కుఱ్ఱోళ్ళని పట్టుకు ఏటాడేసినారు. ఎదవరాజ్యం ఎదవపెబుత్వం.

కాలేజీ సదువులూ. సట్టాలూ, లేని భారతయుద్ధం నాడేనయం. నాయవుండేది. సేతులో ఆయుదం నేనిఓణ్ణె సేతులో ఆయుదవున్న ఓడు సంపగూడదని. ఇప్పటి నాయ శాత్తరంలో అది లేదు గావాల.

గిన్నెటోపీలోళ్ళు సదువుకుని కుఱ్ఱోళ్ళనీ కాల్సి సంపేత్తన్నరు. ఈ గిన్నెటోపీలోళ్ళని నాను పుట్టి డెబ్బయి పంటలయింది కాని సూసెరగను,

తాలూకాఫీసులో కుఱ్ఱోళ్లు జండాఎట్టబోతె తాశీల్దారు పోలీసోళ్ళను రమ్మన్నాడంట. ఆళ్ళని రప్పించినాడని కుత్తెదవలు తాశీల్దారుని కొట్టారంట. ఆడు కలెక్టరుకి కబురు సేసినాడంట. ఆడు గిన్నెటోపీలోళ్ళని ఊళ్ళో దించేసినాడంట.

ఆల్లకి మన బాసరాదు. కొండెదవలు. సర్కిలినసపెక్టరికి సిన్నగ ఒచ్చునంట ఆళ్ళ బాస.

దోతీవాలాకి మారో, అని ఆర్డరేసినాడంట. హ. హ. ఆల్లు పొలానికిపోయి రయితోళ్ళని బట్టుకుని స్టేసన్లఎట్టడం మొదలెట్టినారంట. ఇదేటి ఇడ్డూరవని నలుగురు నవ్వుకుంటుంటె, ఇనసపెక్టరు మళ్ళీ దోతీవాలాని కాదు పేంటు వాలాకి మారో, అని ఆర్డరు మార్చేసినాడంట. అప్పడా ఎదవలు పేంటుతొడిగే ఓడినల్లాట్టుకు కొట్టారంట. సిత్రవయిన కతె.

నా కొడుకేటి సేసినాడని తలమీద మోదీసినారు? ఎదవలు. మనుసులేని రాచ్చసులు కాకుండుంటె. ఆంధ్ర

రాష్ట్రిం కావాలని అన్నాడని ఆడి తలమీద లాటీ కర్రతో కొడతారా? ఏదో కావాలన్నాడు కుత్తెదవ. పోలీసోడు ఆంధ్ర రాష్ట్రం ఇచ్చీఓడూ కాదు. ఈకుత్తెదవలు పుచ్చుకునీఓరూ గాదు.

నారాయణగోడి తలపగిలి ఎంత రగతం కారిపోనాది! ఏటో ఆణ్ణి కొట్టేసరికి అందరూ పారిపోనారంత. ఆడిసుట్టూ జనం మూగడానికే బయపడిపోయిన్రు గిన్నె టోపీలోళ్ళు తంతారని. నా కొడుకు పేనాలు తియ్యడానికే వచ్చినారు నాగుంది.

ఎదవని ఏ పట్నవాసుపత్రికేనా తీసుకుపోన్నగాను. అవునట్టు బస్సులు పడనేదుగదూ!

ఎప్పుడో నా సిన్నప్పుడు మా తాత సెపితే సిత్రవయిన కత ఇన్నటు ఇనీఓణ్ణి. రంగంల, సింగపూర్ల, బొంబాయిల, ఇంకెక్కడో పెద్ద పెద్దోళ్ళు మీటింగెట్టుకుంటే తోవ కాసి కాల్చీసినారంట మనూసున్న మనుసులే. అంతే కాని మన ధర్మవెరిగిన దేశంల, ఇలాటి పల్లెటూళ్ళల్ల ఇలా కొట్టోళ్ళని సంపడం ఇసిత్రవె.

నారాయణగోడికి సిలక్కి సెప్పినట్టు సెప్పేఓణ్ణి. ఒద్దుర బాబు, నా మాటినుకో సమ్మె జోలికెల్లకు. కోతి గెంతుతె సాయిబాబు నూకలు గుంజుకున్నట్టు మీలాటోళ్ళని, మీ సదువుకునీ కుర్రోళ్ళని ఏమోమో సెప్పి సెగతీసి అల్లర్లు సేయించి, గెలిస్తే, ఎవడో ఓడు మంత్రవతడు. లేపోతే మరోటవతడు. తర్వాత ఆ ఎదవ మనలాటోళ్ళ వేపు సూడమన్నా సూడ్డు. అన్నాను.

పిల్లకాకికేటి తెలుస్తది ఉండేలు దెబ్బని. ఆ ముసిలి నక్కలు, ఇలాటి తంత్రాల్లా పండిపోయిన ఎదవల ఆలోశనలు, ఈ సదువుకునీ కుఱ్ఱోళ్ళకేటి తెలుస్తయి.

నాలాటి తంద్రులెంతమంది కడుపు కాలి ఏడుస్తన్నరో. నా కడుపు నేనే కాల్చుకున్నానే. గాబారాపడిపోయి డాక్టేరు కాడికె పరిగెట్టిన్ను. ఆడు రానన్నడు మొదట. రాకపోయినా తీరిపోను. నాను. తిక్కోదవనని డాక్టేరుకి తెలుసు. అందుకే నా ఎనకాల పారొచ్చిండు.

ఆడు తాగుతున్నాడని నాకేటి తెలుసు? ఆడు ఇస ఇంజక్షనిచ్చి ఎల్లిపోనాక కులపోళ్ళంత అన్నారు. ఏట్రా ఎంకా తాగినోడిచేత నారాయణగోడికి ఇంజక్షనిప్పించినావని. ఆడు తాగినాడని నాకేటి తెలుద్ది.

ఆడు తాగినాడనీ, తాగినప్పుడు ఇవ్వకూడని ఇంజక్షనిచ్చి నా కొడుకుని సంపెత్తాడనీ కలగన్నానా?

నారాయణగోడు సచ్చిపోయాడనీ తనికి ఎత్తెత్తిపోన్నా. డాక్టేర్ని పాడిసెయ్యాలని ఆడింటికి పరుగెడుతుంతె నా సేతులకత్తి నాక్కోని నన్ను రాటకేసీ కట్టేసినారు, నేపోతె అయ్యాళ ఆడ్ని పొడిసి నానూ సద్దును.

సావక నానెందుకు బతుకుతున్నాను? నచ్చివి సచ్చిపోనాక నారాయణగోణ్ణి డాక్టేరుని సెయ్యాలని బతికినాను. ఆడికోసం బతికాను.

ఆడు సచ్చిపోనాక ఎందుకు బతికినాను! నారాయణ గోడికిసవింజక్సనిచ్చిన డాక్టేరుని పొడిసెయ్యాలని.

డాక్టేరుని పొడిసెయ్యాలనుకున్న ఓణ్ణి ఏటిచేసినాను! హా. హా. హా. ఒరే ఎంకా నువ్వు ఎఱ్ఱోడివేన్రా! డాక్టేరుని పొడిసెయ్యాలని సెరువుగట్టుకాడ కత్తి నూరుతుంతె, ఏటో అరుపినిపించి లేచినిలుచున్న. మళ్ళే ఆరుపొకటి ఇనిపించి అటుకాసి నిలిసిపోన్న ఆలోశన నేకుండానే ఎటో ఎవడే ఎందుకలా ఆడు త్తండా, సూద్దారని.

డాక్టేరు కొడుకు పదారేళ్ళ కుఱ్ఱోడు మామిడితోట్లా నేలబడి కొట్టుకుని పొర్లి పొర్లి ఏడుస్తండెందుకో.

నా కొడుకు నాగె డాక్టేరు కొడుకు కొట్టుకుంతండు. కుంతసేపూరుకుంతె సస్తడు. ఏదో కరిసింది గావాల. సావనీ నానాగె డాక్టేరుకూడ ఏడ్చి ఎత్తె త్తిపోతడు. అనుకుంత ఎనక్కి తిరిగిపోన్న.

రచ్చించమని అరుత్తన్నడు డాక్టేరు కొడుకు. నన్ను సూసినాడు గావాల. మరి మనుసాగింది కాదు. పేనవంతె అందరికి తీపె. పేనాలు పోయీతప్పుడీ ఆలోశనలేటి? అనుకుంత ఆబాబుకాడికెళ్ళి ఏటయ్యిందిబాబు అని అడిగిన్న.

పాదం సూపించి పావు కరిసిందన్నడు. రగతం సిమ్మ్మా కాడ నాను నూరిన కత్తెట్టి సిన్న గంటెట్టి రగతం పిండేసి నాను ఇసం పోతాదని. ఏటో ఆయేళప్పుడు ఆ బాబు డాక్టేరు కొడుకనిపించనేదు. మాసెడ్డ కనికర వేసినాది. ఆ బాబుని రచ్చించమని దేవుడికి మొక్కుకుంతి. ఆ బాబు నెత్తుకొని మంత్రగోడికాడికి పరిగెట్టినాను.

ఇసయం తెలిసి పారొచ్చినాడు డాక్టేరు. అప్పుడు డాక్టెరు మొకం సూడాల. దివాలా తీసిన సావుకార్లా అయిపోయింది. ఏడుపు ముక పెట్టేసినాడు. నా కొడుకుని సంపినాడని పగేటయ్యిందో. నా మను చేటో మరి. ఒల్ల కొండి డాక్టెరుబాబు. బాబు పేనానికేం డక్కా నేదు. అని డాక్టెర్ని ఓదార్సినాను.

ఆ బాబుకి ఇసం ఇరిగి కళ్ళు తెరిచీసరికి తెల్లారిపోనాది. ఆడి కొడుక్కి పావుకరిత్తె ఇసంపిండి మంత్ర వేయించినానని పదిరూపాయిల కాయితం నా సేతులెడతన్నడు డాక్టెరు. నానేం డాక్టెర్నా! లంచ ఉచ్చుకుని వైద్దం సెయ్యడానికి, సేతనయిన సాయంసేసి పోయిన పేనం కాపాడాలనుకుంతం కాని డబ్బులుచ్చుకుంతన! నంచంతినే నంజా కొడుకుని అను కున్నాడు గావాల డాక్టెరు నన్ను. హి. హి. హి. ఆడి కొడుకు పేనం ఇలువ పదిరూపాయిలా! డాక్టెరు ఆడి కొడుక్కి పావుకరిత్తె ఇసంపిండి మంత్ర వేయించినానని పదిరూపాయ లిత్తడు, సీ, ఎదవ పెపంచకం.

ఎందుకర్ర కుఱ్ఱెదవలు! నన్ను సూసి అలా నవ్వుత న్నరు! ఏట్రా అంతన్నరు? ఎంకడి ఏకపాత్రాబి నయువా! ఒ. ఒ. ఒ నాను నాటకాలోణ్ణా! ఏసాలేసే ఓడు తక్కువను కున్నరేటి! దేవుడికన్నా ఏక్టరే ఎక్కువ నాగున్నాడురా పెజలకి ఈ రోజుల్లో .... ఏయ్ .... పోతారా. పోరా! నాను ఎట్టోణ్ణా!